క్లుప్తంగా

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

గుంటూరు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని మండల వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి తెలిపారు. శనివారం చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. క్యాంప్‌లో 89 కుల ధృవీకరణ, 82 ఆదాయ ధృవీకరణ పత్రాలు, 33 మందికి ఆధార్ సేవలు, రెవెన్యూ, తదితర సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ బిట్టు రమేష్, మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఏఓ సుబ్రమణ్యం, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల జేసీఎస్ కన్వీనర్ ఎదురుపాక వెంకట్, ఈవో లక్ష్మి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

పథకాలు అందించడమే లక్ష్యం

పాండ్రపాడు(కాకుమాను): గ్రామాలలో అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యమని వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. పాండ్రపాడులో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి తేళ్ల ప్రేమకుమారి పలువురికి వివిధ రకాల ధృవపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, సర్పంచ్‌లు దేవిరెడ్డి సాంబయ్య, రాంబాబు, పెద్ది లక్ష్మీ, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ నెహ్రూ పాల్గొన్నారు.

ఆపరేషన్‌కు కొద్ది నిమిషాల ముందు 'వైఎస్సార్ పెన్షన్ కానుక'



ప్రత్తిపాడు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధునికి, ఆపరేషన్‌కు కొద్ది నిమిషాల ముందు వైఎస్సార్ పెన్షన్ కానుకను అందించారు. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు చిన్నపల్లెకు చెందిన గేరా పెద సిద్ధయ్యకు ఆరోగ్యం బాలేదు. దీంతో కొద్దిరోజుల కిందట గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం ఉదయం సిద్ధయ్యకు గుండెకు సంబంధించి ఆపరేషన్ జరిగింది. ఆపరేషన్‌కు తీసుకువెళ్లే కొద్ది నిమిషాల ముందు ఆ గ్రామ వలంటీర్ బత్తుల పవన్ ఆస్పత్రికి వెళ్లి సిద్ధయ్యకు పింఛన్ నగదును అందించాడు.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యం

పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వెనిగండ్లలో ధృవ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి, ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్

చేబ్రోలు: దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను క్షేత్రస్థాయిలో సత్వరమే పరిష్కరించేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకం తీసుకువచ్చారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో, పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామంలో శనివారం జగనన్న సురక్షా కార్యక్రమం జరిగింది. వేజండ్ల-1 గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని, మాట్లాడారు. అర్హులకు అన్ని రకాల ధృవీకరణ పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, కె.ఈశ్వరరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించి, 692 సర్టిఫికెట్లను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పంపిణీ చేశారు. ఎంపీపీ భవనం పద్మలీల, వైస్ ఎంపీపీ అంబటి వీరరాఘవయ్య, వెల్లలూరు గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, కొఠారు వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ సైపుల్లా, దాసరి నారాయణరావు, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు శ్రీకాంత్ కేదార్నాథ్, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

పెదకాకాని: పెదకాకాని మండలం వెనిగండ్ల అగతవరపాడు గ్రామాల లబ్ధిదారులకు శనివారం పలు ధృవ పత్రాలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ అందజేశారు. గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌లో వారు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించడంతోపాటు ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను ఇవ్వడానికి ఈ బృహత్తర కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, గ్రామ సర్పంచ్ వేల్పుల శ్రావణి, ఉప సర్పంచి కొండమడుగుల వెంకటరెడ్డి, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పెదకాకాని: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. తక్కెళ్ళపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడవ రోజు శనివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి, సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు ఎమ్మెల్యే కిలారి వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, చాగంటి మురళీమోహన్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, వార్డు మెంబర్ షేక్ ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

జర్మన్ యూనివర్సిటీతో వీవీఐటీ అవగాహనా ఒప్పందం



అవగాహన ఒప్పందంలో చైర్మన్ విద్యాసాగర్, జర్మన్ ప్రతినిధులు

పెదకాకాని: జర్మనీలోని స్టెయిన్బిస్ యూనివర్సిటీతో వీవీఐటీ కళాశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీ ఏర్పాటు చేసిన 'అకడమిక్ అలియన్స్ మిషన్ జర్మనీ-2023' కార్యక్రమంలో పరిశ్రమ అవసరాలకు తగినట్లు విద్యార్థులకు శిక్షణ, ఉపాధితో కూడిన ఉన్నత విద్యకు ఈ ఒప్పందం దోహదపడుతుందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరు కళాశాలలో శనివారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ.. అటోమేటివ్, స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో 12 మంది సభ్యుల బృందం ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. స్టెయిన్బిస్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ బెర్త్రమ్, తాను ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలిపారు. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్‌తో పాటుగా ఉపాధితో కూడిన ఉన్నత విద్యను అందించేందుకు పరస్పర సహకారం అందనున్నట్లు తెలిపారు.

సమస్యలు వింటూ..పరిష్కారం చూపుతూ

- 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం
- మూడున్నర గంటలపాటు ప్రజల మధ్యనే ఉండి సమస్యలు విన్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- అక్కడికక్కడే అధికారులకు పరిష్కారానికి ఆదేశాలు



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



హాజరైన ప్రజలు

పాతమల్లాయపాలెం (ప్రత్తిపాడు): 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం లభించింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా, టాప్ ప్రయారిటీగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులు అంతే సీరియస్‌గా తీసుకున్నారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో శనివారం జరిగిన సురక్ష క్యాంప్‌లో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మూడున్నర గంటల సమయాన్ని గడిపారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు విన్నవించే సమస్యలను సహనంతో వింటూ, సానుకూలంగా స్పందించారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సచివాలయంలోనే ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు.

అనేక సమస్యలు.. అక్కడికక్కడే ఆదేశాలు

- కొత్తమల్లాయపాలెం చెరువులో నీళ్లు తక్కువగా ఉన్నాయని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నాగార్జున సాగర్ ఆయకట్టుకు చివరన ఉన్న తమ గ్రామాల్లో సాగునీరు అందడం లేదని, కాలువ మెయింటెనెన్స్ పనులు వెంటనే చేయించాలని, సత్రం భూములకు సంబంధించిన మస్యలపై కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, రెవెన్యూ జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడారు.
- నకిలీ విత్తనాలు అధికంగా మండలంలో చెలామణీ అవుతున్నాయని, స్థానికంగా ఇక్కడే మిర్చి విత్తనాలను తయారు చేస్తున్నారని, దీని వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని కొందరు రైతులు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ జిల్లా వ్యవసాయాధికారితో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే టాస్క్‌ఫోర్స్ బృందాలను పంపి తనిఖీలు చేసి, కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నకిలీలకు పాల్పడే వారిని ఉపేక్షించవద్దని, ఎస్పీతో కూడా ఈ విషయంపై మాట్లాడుతానని చెప్పారు.
- పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం రైతులు ఆర్‌బీకేల్లో సిబ్బంది, ఉత్పత్తులు కూడా ఉండటం లేదని చెప్పడంతో ఏవో, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. నిత్యం రైతులతో తిరుగుతూ వారికి అందుబాటులో ఉండాల్సిందేనని, లేదంటే యాక్షన్ తీసుకుంటానని తేల్చి చెప్పారు.
- గ్రామంలో సచివాలయ భవనం నిర్మించి దాదాపుగా రెండేళ్లు గడుస్తున్నా పీఆర్ ఏఈ బిల్లులు చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సాంబిరెడ్డి అనే వ్యక్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే బిల్లులు చేయాలని అవసరమైతే ఎస్ఈతో తాను మాట్లాడుతానని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు.
- తన రేషన్ కార్డు రద్దు అయ్యిందని, కార్డు లేక ప్రభుత్వ పథకాలకు అర్హత పొందలేకపోతున్నానంటూ వృద్ధురాలు కలెక్టర్ వద్ద వాపోయింది. స్పందించిన ఆయన వెంటనే పాత రేషన్ కార్డు యాక్టివేట్ చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. టెక్నికల్ టీంతో తాను కూడా మాట్లాడతానని తెలిపారు.
- సాగర్ ఆయకట్టున ఉన్న తమ గ్రామాలకు సాగునీరు అందడం లేదని, గుంటూరు చానల్‌ను పొడిగించాలని రైతులు లిఖిత పూర్వకంగా కలెక్టర్‌ను కోరారు. గుంటూరు చానల్‌కు సంబంధించి భూ సేకరణ ప్రక్రియ ప్రారంభించామన్నారు. కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు డ్రాఫ్ట్ పబ్లికేషన్లు కూడా రెడీ అవుతున్నాయని సమాధానం ఇచ్చారు.
- నడింపాలెంలో జగనన్న హౌసింగ్ లే అవుట్ పక్కనే ఇళ్లకు ఆనుకుని అక్రమంగా గ్రావెల్ త్రవ్వకాలు జరుగుతున్నాయని, పొరబాటు జరిగితే పిల్లల ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విజిట్ చేసి గట్టిగా యాక్షన్ తీసుకోవాలని ఎస్ఐ, తహసీల్దార్‌లను ఆదేశించారు. ఇలాంటి వాటిని ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఇలా అనేక రకాల సమస్యలకు కలెక్టర్ అక్కడిక్కడే క్యాంప్‌లోనే పరిష్కారాలను చూపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కాగా మిగిలిన యంత్రాంగమంతా సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలోనే ఉండి 143 ఆదాయ, 139 కుల, 18 రేషన్ కార్డు, 72 ఆధార్ సర్వీసులతో పాటు మొత్తం 394 టోకెన్లను పరిష్కరించారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు గ్రామానికి వెళ్లే దారిలో ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కుంచాల పరమేశ్వరరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం ఎస్ఐ డి.రవీంద్రబాబుకు అందింది. దీంతో ఆయన సిబ్బందితో కలిసిదాడి చేసి తొమ్మిది 180 ఎంఎల్ ఓషన్ బ్లూ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కాకుమాను: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్ఐ రవీంద్ర తన సిబ్బందితో శనివారం వేకువ జామున స్వాధీనం చేసుకున్నారు. కాకుమాను నుంచి అప్పాపురానికి రేషన్ బియ్య తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుని, స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, 30 బస్తాల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులను అందజేసి, వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొత్తరెడ్డిపాలెంలో వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన షేక్ మస్తాన్‌వలి

చేబ్రోలు: మద్యం సేవించే సమయంలో వివాదం జరిగి వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(57), బుల్లబ్బాయిలు వైన్ షాప్ సమీపంలో మద్యం సేవించే సమయంలో ఇరువురికి వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఆవేశంతో బుల్లబ్బాయి కర్రతో మస్తాన్‌వలిని విచక్షణారహితంగా తలపై కొట్టాడు. తీవ్ర గాయాలై మస్తాన్‌వలి అక్కడక్కడే మరణించాడు. నిందితుడు బుల్లబ్బాయి ఘటనా ప్రాంతంలోనే ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. చేబ్రోలు ఎస్ఐ కె ఆనంద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.